విశాలాంధ్ర
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు జిల్లా



పోలీస్ సంక్షేమ దివస్‌ను నిర్వహించిన జిల్లా ఎస్పీ

విశాలాంధ్ర బ్యూరో -నెల్లూరు: పోలీసు పెరేడ్ గ్రౌండ్ కు జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా విచ్చేసి పోలీసు అధికారులు, సిబ్బంది (సివిల్, ఎ.ఆర్. హెూం గార్డ్స్) నిర్వహించిన గౌరవ వందనం స్వీకరించిన తదుపరి కవాతును వీక్షించారు.స్క్వాడ్ డ్రిల్ అంటేనే క్రమశిక్షణతో కూడుకున్నది. ఐక్యమత్యాన్ని పెంపొందించడంతో పాటు సిబ్బంది అందరూ సమైక్యంగా విధి నిర్వహణకు తోడ్పడుతుంది. ఒక్కరు పొరపాటు చేసినా స్క్వాడ్ మొత్తం క్రమ శిక్షణ కోల్పోతుంది. స్క్వాడ్ డ్రిల్,యోగా,ఫిజికల్ ట్రెనింగ్ ప్రతి రోజూ చేయడం వల్ల ఫిజికల్ ఫిట్నెస్ మెరుగుపడుతుంది. తద్వారా ఆరోగ్యంగా ఉంటూ క్రమ శిక్షణతో విధులు నిర్వహిస్తారు.శిక్షణా కాలాన్ని మరోసారి జ్ఞప్తికి తెస్తుంది అని అన్నారు. తదుపరి స్టేషన్ ప్రకారం డ్రిల్ చేయించగా, బాగా పెరేడ్ చేసి ట్రాఫిక్ స్టేషన్ నకు మొదటి స్థానం,నవాబ్ పేట స్టేషన్ కు రెండవ స్థానం ఎంపిక చేసి, అభినందించి, రివార్డు జిల్లా ఎస్పీ ప్రకటించారు. అనంతరం పెరేడ్ గ్రౌండ్ జిల్లా పోలీసు కార్యాలయం నందు సిబ్బంది సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా "పోలీస్ సంక్షేమ దివస్' కార్యక్రమాన్ని నిర్వహించిన జిల్లా ఎస్పీ సిబ్బందితో ముఖాముఖిగా మాట్లాడి డిజర్సన్, బదిలీలు, కోఆపరేటివ్, భద్రత లోన్, అనారోగ్యం తదితర అర్జీలను స్వయంగా స్వీకరించి, నిశితంగా పరిశీలించి,అడ్మినిస్ట్రేటివ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్(క్రైమ్స్) ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి:డిఎస్పీ

విశాలాంధ్ర-జలదంకి: వాహన యజమానులు నిబంధనలను పాటించాలని కావలి డిఎస్పి వెంకటరమణ స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక జలదంకి పోలీస్ సీఐ మహమ్మద్ ఫిరోజ్‌తో కలిసి వాహన యజమానులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు, లైసెన్స్ ధ్రువీకరణ పత్రాలు సక్రమంగా ఉంచుకోవాలన్నారు. ఇన్సూరెన్స్ అప్డేట్ లో ఉండేటట్లు చూసుకోవాలి అన్నారు. ఆటోలో పరిమితికి మించి ప్రయాణీకులను ఎక్కించుకుంటే జరిమానా విధించడంతోపాటు ఆటోలను సీజ్ చేస్తామన్నారు. ద్విచక్ర వాహనదారులు కూడా సరైన ధ్రువపత్రాలు తమ వెంట ఉంచుకోవాలన్నారు. అలాగే హెల్మెట్లను విధిగా ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జలదంకి ఎస్ఐ ఆదిలక్ష్మి, ఏఎస్ఐ లు హరిబాబు, దేవదానం పోలీస్ సిబ్బంది ఉన్నారు.

దుకాణాల వద్ద తడి, పొడి చెత్త బుట్టలు తప్పనిసరి:కమిషనర్

విశాలాంధ్ర-నెల్లూరు కార్పొరేషన్: దుకాణాల వద్ద తడి, పొడి చెత్త బుట్టలు తప్పని సరిగా ఉంచాలని కమిషనర్ వికాస్ మర్మత్ సూచించారు. నెల్లూరు ట్రంక్ రోడ్డులోని బొల్లినేని హాస్పిటల్, ఎమ్.జీ.బి మాల్, కొండాయ పాలెం రోడ్, ఏ.సి స్టేడియం, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి, కరెంట్ ఆఫీసు కూడలి, వేదాయపాలెం మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో జరుగుతున్న చెత్త సేకరణ పనులను కమిషనర్ శుక్రవారం పరిశీలించారు. డివిజనుల పరిధిలోని స్థానిక సమస్యలపై అందుకున్న ఫిర్యాదులను కమిషనర్ ప్రత్యక్షంగా పరిశీలించి అధికారులకు వివిధ సూచనలు జారీ చేశారు. స్థానికంగా ఉన్న దుకాణాల నిర్వాహకులతో మాట్లాడుతూ వ్యర్థాలను డ్రైను కాలువల్లో వేయరాదని, ప్రతీ దుకాణం బయట తడి, పొడి చెత్త సేకరణకు విధిగా డస్ట్ బిన్ లను తప్పనిసరిగా ఉంచాలని సూచించారు. డస్ట్ బిన్ లను ప్రజలకు కనిపించేలా షాపుల ప్రాంగణాల్లో ఉంచి, ఖాతాదారులు తప్పనిసరిగా వినియోగించేలా అవగాహన కల్పించాలని సూచించారు. షాపుల పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే షాపు నిర్వహకునికి జరిమానా విధిస్తామని కమిషనర్ హెచ్చరించారు.

సచివాలయాల తనిఖీ

నగర పాలక సంస్థ పరిధిలోని స్థానిక 46/1 దండువారి వీధి, 46/3 బృందావనం వార్డు సచివాలయాలను కమిషనర్ వికాస్ మర్మత్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయాలలోని ఇన్స్పెక్షన్ రిజిష్టరు, నోటీసు బోర్డు, హాజరు రిజిస్టరు, స్పందన రిజిష్టరులతో పాటు వివిధ సంక్షేమ పథకాల రికార్డులను పరిశీలించారు. సచివాలయాల పరిధిలోని ప్రజలకు స్థానిక పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అందిస్తున్న ఉచిత వైద్యం, మందుల పంపిణీ, రక్త పరీక్షలు తదితర సేవలపై అవగాహన కల్పించాలని కమిషనర్ సూచించారు.ప్రజలకు అందించే సేవల్లో నిబద్ధత పాటించాలని సూచించారు. అనంతరం అనంతరం టెక్కెమిట్ట ఆర్టీసీ సమీపంలోని స్పందన ఫిర్యాదును కమిషనర్ ప్రత్యక్షంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిసిపి దేవీ కుమారి తదితరులు పాల్గొన్నారు.

33వ డివిజన్‌లో సమస్యలను పరిశీలించిన మేయర్

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు :: నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని 33వ డివిజన్ నేతాజీ నగర్,వెంగళరావు నగర్,ప్రాంతాలలోనిస్థానికసమస్యలనుమేయర్,స్రవంతి జయవర్ధన్ శుక్రవారం పరిశీలించారు.డివిజన్ కార్పొరేటర్ రణం మంజుల నాయుడు, ఇంచార్జ్ రణం హజరత్ నాయుడులతో కలిసి డివిజన్ నందు నేతాజీ నగర్ 6వ వీధి, వెంగళరావు నగర్ తాతయ్య బడి పరిసర వీధులలో పర్యటించి స్థానిక ప్రజలతో మేయర్ ప్రత్యక్షంగా మాట్లాడుతూ వివిధ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నెల్లూరు రూరల్ శాసన సభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సూచనల మేరకు స్థానిక 33వ డివిజన్ నేతాజీ నగర్, వెంగళరావు నగర్ లను పర్యటించడం జరిగిందన్నారు. స్థానికంగా పలు చోట్ల మురుగు నీరు ప్రవహించేందుకు డ్రెయిన్ కాలువలు, వాటికి అనుసందానంగా కల్వర్టుల నిర్మాణాలు అత్యంత ప్రధానమైన మౌళిక సదుపాయంగా గుర్తించామని తెలిపారు. డ్రెయిన్ కాలువల లేక ప్రస్తుతం వివిధ ప్రాంతాలలో మురుగు నీరు నిల్వ వుండి దోమల వ్యాప్తికి కారణమవుతోందని స్థానికులు తమ దృష్టికి తీసుకువచ్చారని పేర్కొన్నారు. నగరపాలక సంస్థ అధికారులతో మాట్లాడి అవసరమైన చోట డ్రెయిన్ కాలువలు, కల్వర్టుల నిర్మాణాలను ప్రారంభించేలా కృషి చేస్తామని మేయర్ తెలియజేశారు. తాతయ్య బడి సమీపంలోని విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ నుంచి ప్రమాదాలు వాటిల్లకుండా ప్రజలకు రక్షణ కల్పించేందుకు అవసరమైన రక్షణ కంచే ఏర్పాటు చేసేందుకు విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని మేయర్ స్పష్టం చేశారు. స్థానికంగా ఉన్న ఏ సమస్యలైనా తమ దృష్టికి కాని, స్థానిక కార్పొరేటర్, ఇంచార్జ్ దృష్టికి తీసుకువస్తే వేగవంతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ప్రజలకు మేయర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పోరేషన్ అధికారులు, సచివాలయ కార్యదర్శులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

సుచేతనగర్‌కు తాగునీటిని సరఫరా చేయాలి

విశాలాంధ్ర - కావలి : పట్టణంలోని 38వ వార్డు సుచేతనగర్ లో త్రాగునీటి సరఫరా చేయాలని సిపిఎం పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం సుచేత నగర్ లో పర్యటించారు. అక్కడి ప్రజలను సమస్యలను వారు అడిగి తెలుసుకున్నారు. కాలనీ వాసులు మాట్లాడుతూ ఇక్కడ 40 కుటుంబాలు ఉన్నాయని, అడవిలో బతుకుతున్నామని, అందరూ గిరిజనులమని, మా కాలనీకి పూర్తిగా తాగునీటి సరఫరా కావడంలేదని, రోజు మార్చి రోజు రెండు కుళాయిలకు రెండు రెండు బిందెలు మాత్రమే వస్తాయని, మరికొన్ని కుళాయిలు పూర్తిగా నీళ్ళు రావని, చాలి చాలని నీళ్లతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, తాగడానికి కూడా నీళు లేని పరిస్థితుల్లో ఉన్నామని తెలిపారు. పరిష్కారానికి సమైక్యంగా ఇక్కడి ప్రజలు పోరాటాలు చేయాలని, పోరాటాలు చేసి సమస్యలను పరిష్కరించుకోవాలని, మీ పోరాటాలకు మేము అండగా ఉంటామన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య, నాయకులు జి. మధుసూదన్ రావు, బి. కృష్ణయ్య, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

కళ్యాణ మహెూత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కందుకూరు రూరల్ : శ్రీ స్కందపురి జనార్ధన స్వామి దేవస్థానం, కీర్తిశేషులు శ్రీ రామగిరి భ్రమరాంబ, సుబ్బారావు కళ్యాణ మండపంలో శుక్రవారం శ్రీ జనార్ధన స్వామి కళ్యాణ మహెూత్సవం అత్యంత వైభవంగా జరిగింది . ఈ కళ్యాణ మహెూత్సవం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీ మానుగుంట మహీధర్ రెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జనార్ధన స్వామి దేవాలయం కమిటీ చైర్మన్ రావులకొల్లు బ్రహ్మానందం, ఈవో బైరాగి చౌదరి, అర్చకులు కలసి ఎమ్మెల్యే కి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ రామగిరి వెంకటకృష్ణ శంకర్ ప్రసాద్, శ్రీ రామగిరి మల్లికార్జున విద్యా శేఖర్, మాజీ ఏఎంసి చైర్మన్ తోకల కొండయ్య, వైయస్సార్ సీపీ సీనియర్ నాయకులు కొండూరి వసంతరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ దివి లింగయ్య నాయుడు, దామా వెంకటేశ్వర్లు, కందుకూరు పట్టణ జెసిఎస్ కోఆర్డినేటర్ ముప్పవరపు కిషోర్, మాజీ కౌన్సిలర్ గేరా మనోహర్, షబ్బిశెట్టి శివ, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు నియోజకవర్గంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: ఆత్మకూరు నియోజకవర్గంలో రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ యం. హరినారాయణన్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఆత్మకూరు నియోజక వర్గ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక శాసన సభ్యుల దృష్టికి వచ్చిన రెవిన్యూ సమస్యలపై జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన రెవెన్యూ సమస్యల పరిష్కార పురోగతిపై శుక్రవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్లో జిల్లా కలెక్టర్ ఎం హరి నారాయణన్, ఆత్మకూరు శాసన సభ్యులు మేకపాటి విక్రమ్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ సమక్షంలో ఆత్మకూరు ఆర్డీవో కరుణ కుమారి,ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని తాసిల్దార్లతో సమావేశమై మండలాల వారీగా వచ్చిన ధరఖాస్తులు వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై క్షుణ్ణంగా సమీక్షించి పలుసూచనలు జారీచేయడమైనది. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆత్మకూరుశాసనసభ్యులునియోజకవర్గంలోని గ్రామాల్లో పర్యటించిన సంధర్భంగా శాసన సభ్యులు దృష్టికి వచ్చిన రెవెన్యూ సమస్యలపై, అలాగే జగనన్న కు చెబుదాం కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు సంబంధించి వచ్చిన సమస్యలపై సంబంధిత మండల తహసీల్దార్లు ప్రత్యేక దృష్టి సారించి నిర్దేశించిన గడువులోగా త్వరితగతిన పరిష్కరించేలా కృషిచేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. గడప గడపకు మన ప్రభుత్వం, జగనన్న కు చెబుదాం కార్యక్రమాల్లో రెవెన్యూ కు సంబంధించిన సమస్యలపై ఎక్కువగా దరఖాస్తులు వచ్చాయని, వాటిని నిబంధనల ప్రకారం చేయగలిగినవి త్వరితగతిన పరిష్కరించాలని, పరిష్కారం చేయలేని విషయాలను ఎందుకు పరిష్కారం చేయలేకపోవడం జరుగుచున్నదో సంబంధిత అర్జీదారులకు స్పష్టంగా తెలియచేయాల్సిన భాధ్యత అధికారులపై వుందన్నారు. అసైన్మెంట్ భూములకు సంబంధించి పట్టా వుండి భూమి మీద ఉన్న వారికి, సాగు చేసుకునే వారికి నిబంధన ప్రకారం సబ్ డివిజన్ చేసి పాసు పుస్తకాల జారీకి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తహసీల్దార్లకు సూచించారు. చుక్కల భూముల జాబితానుంచిఇంకా తొలగించని వాటికిఅత్యధిక ప్రాధాన్యతచ్చి కలెక్టర్ కుప్రతిపాదనలు పంపాలన్నారు. సాదా బైనామా కేసులకు సంబంధించి వచ్చిన అర్జీలన్నీ ఈ నెల 30వ తేదీ లోపు సంబంధిత విఆర్‌ఓలు ఆన్ లైన్‌లో రిజిస్టర్ చేసేలా తహసీల్దార్లు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ అర్జీలకు సంబంధించి కచ్చితంగా రిజిస్టర్ నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. మండల తాసిల్దార్లకు సమస్యల పరిష్కార విషయంలో అనుమానాలు ఉంటే జాయింట్ కలెక్టర్‌ను సంప్రదించి పరిష్కరించుకోవాలన్నారు. పేదలకు నివేశన స్థలాల పట్టాల మంజూరు కు సంబంధించి భూసేకరణ ఎక్కడైన పెండింగ్లో ఉంటే సత్వరం భూ సేకరణ సమస్యలను పరిష్కరించేలా తహసీల్దారు ప్రత్యేక శ్రద్ధ చూపాలనిజిల్లా కలెక్టర్ తెలిపారు. ఈసమావేశంలో ఆత్మకూరు ఆర్డిఓ కరుణ కుమారి, ల్యాండ్ సర్వే రికార్డ్స్ ఎడి హనుమాన్ ప్రసాద్, ఆత్మకూరు నియోజక వర్గ పరిధిలోని తహసిల్దార్లు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- మత్తు పదార్థాల సమాచారం 14500 కు అందజేయాలి - స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు

విశాలాంధ్ర - కావలి: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరంగా జీవించాలని కావలి స్పెషల్ ఎన్ఫోర్స్ మెంట్ బ్యూరో స్టేషన్ ఇన్స్పెక్టర్ కే.శ్రీనివాసరావు పేర్కొన్నారు. మత్తు పదార్థాలు సేవించుట వల్ల కలిగే దుష్ఫలితాల పై శుక్రవారం కావలి ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ సైక్రియాటిక్ వైద్యుడు డాక్టర్ అఖిలేష్, జిల్లా ఉప విద్యా శాఖాధికారి రఘురామయ్య, మండల విద్యాశాఖాధికారి బండి గోవిందయ్య, స్కూల్ హెడ్ మాస్టర్ నీరజ, కావలి స్పెషల్ ఎన్ఫోర్స్ మెంట్ బ్యూరో స్టేషన్ సబ్-ఇన్స్పెక్టర్ కె. శ్రీధర్, కావలి ఒకటవ పట్టణ ఎస్సై అంబేద్కర్, కావలి రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్సై, తదితరులు పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్థానిక తుమ్మలపెంట రోడ్డులోని జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్ నందు, ముసునూరులోనిజిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్ నందు, వెంగళరావు నగర్ లోని గిరిజన బాలుర ఉన్నత పాఠశాల నందు, స్థానిక శ్రీ పొట్టి శ్రీరాములు మున్సిపల్ హై స్కూల్ నందు ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండి సంపూర్ణ ఆరోగ్య వంతులుగా జీవించాలని, సమాజానికి మేలు చేసే పౌరులుగా తయారవ్వాలని కోరారు. స్పెషల్ ఎన్ఫోర్స్ మెంట్ బ్యూరో టోల్ ఫ్రీ నెంబరు అయిన 14500 గురించి విద్యార్థులకు అవగాహన కల్పించి, మత్తుపదార్థాల గురించి ఎటువంటి సమాచారము ఉన్న టోల్ ఫ్రీ నెంబరుకు తెలియజేయవలసినదిగా కోరారు. మత్తుపదార్థాల వల్ల కలిగే దుష్ఫలితాల గురించి ప్రదర్శించిన షార్ట్ వీడియో విద్యార్థులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఆక్రమణల తొలగింపు

మూడు జెసిబిలు తో తొలగింపు -అధికారులతో స్వల్ప గొడవలకు దిగిన దుకాణదారులు

రెండు రోజులు సమయం కోరిన కొందరు దుకాణ యజమానులు -గట్టి పోలీస్ బందోబస్తు మధ్య తొలగింపు

విశాలాంధ్ర-అనుమసముద్రంపేట: ప్రముఖ యాత్ర స్థలం అయిన ఏఎస్ పేటలో వెలసిన శ్రీ హజరత్ వారి దర్గాకు వెళ్లే ప్రధాన రహదారి పై ఉన్న ఆక్రమణలను శుక్రవారం పంచాయితీ కార్యదర్శి యస్దాని భాషా ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తు మధ్య తొలగింపుకు శ్రీకారం చుట్టారు. ఎన్నో ఏళ్లుగా దర్గా కు వెళ్లే రహదారి ఆక్రమణలకు గురికావడం వాహన రాకపోకలకు ఇబ్బందికరంగా మారడం తరచూ గొడవలు జరగడం లాంటి సంఘటనలతో, పాటు రెండు దుకాణ యజమానుల మధ్య నెలకొన్న వివాదం తదితర కారణాలతో ఆక్రమణల తొలగింపు అనివార్యమైంది. గత కొంతకాలంగా రోడ్డు పర్యాయాలు తొలగింపుకు తేదీలు ఖరారు చేసారు. అయితే కొందరు దుకాణదారులు గృహ యజమానులు ఉన్నతాధికారులతో వారి బాధలు తెలుపుకొని తొలగింపు కార్యక్రమాన్ని వాయిదా చేయించారు. లోకాయుక్త న్యాయమూర్తుల ఆదేశాలతో 17 నుంచి తొలగింపు కచ్చితంగా చేయాల్సిందేనని కార్యదర్శి యస్ దాని మండలాధికారులతో కలిసి ఆక్రమణదారులకు తెలిపారు. అందుకు వారు అంగీకరించడంతో శుక్రవారం ఉదయం నుంచి తొలగింపు కార్యక్రమం చేపట్టారు. ఆత్మకూరు సిఐ రవి నాయక్ పలు మండలాల సభ్యులు ప్రత్యేక పోలీస్ బృందంతో బందోబస్తు మధ్య రోడ్డు ఆక్రమణలకు పాల్పడిన దుకాణాలను తొలగించారు. 30 అడుగుల మేర రోడ్డు వెడల్పు చేశారు. నగర ఖాన సెంటర్ నుంచి ఆనకట్టవరకు మొదటి గేటు నుంచి ఖజా మైదాన్ వరకు తొలగింపు చేపట్టారు. కొందరు దుకాణదారులు అధికారులు చెప్పిన దాని ప్రకారం తొలగింపు చేపట్టలేదని పోలీసులతో పలుచోట్ల వివాదానికి దిగారు. వారికి సర్ది చెప్పి ఆక్రమణల తలగింపు నిర్వహించారు. అక్రమ తొలగింపుతో దర్గాకు వెళ్లే వీధులు వెడల్పుగా మారాయి. అయితే నిత్యం జనాలతో కళకళలాడే అంగళ్లు బోసిపోయాయి. శుక్రవారం కావడంతో పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు సైతం ఇబ్బందులకు గురయ్యారు. తాత్కాలికంగా దుకాణదారులు యాత్రికులు ఇబ్బందులు పడ్డ భవిష్యత్తులో అందరికీ ఉపయోగకరంగా ఉంటుందని పలువురు గ్రామ పెద్దలు యాత్రికులు, పోలీస్ అధికారులు, పంచాయితీ, రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు. దర్గా సెంటర్లో ఉన్న సుమారు 250 కి పైగా దుకాణాలను, గృహాలను పగులగొట్టి ఆక్రమణల పేరుతో తొలగించేందుకు ముందుకు వచ్చిన అధికారులు అసలు ఈ ఆక్రమణల తొలగింపుకు కారణమైన రెండు దుకాణాల మధ్య ఉన్న వివాదాన్ని ఇప్పటికైనా పరిష్కరించగలరా లేదా అని గ్రామ ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఓటర్ వెరిఫికేషన్ పై ప్రత్యేక దృష్టి : మాజీ మంత్రి నారాయణ

నేనే ఇంటింటికి తిరుగుతున్నా-క్షేత్ర స్థాయిలో టీడీపీ బలంగా ఉంది: మాజీ మంత్రి

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు::నెల్లూరు నగరం 13వ డివిజన్ యలమవారిదిన్నెలోశుక్రవారండోర్ టూడోర్ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి,నగర నియోజకవర్గ ఇన్‌చార్జి పొంగూరు నారాయణ,ఆయన కుమార్తెసింధూర పాల్గొన్నారు. నారాయణనే స్వయంగా ఇంటింటికి వెళ్లి ఓటర్ వెరిఫికేషన్ చేస్తున్నారు. అనంతరం నారాయణ మీడియాతో మాట్లాడారు. ఓటర్ వెరిఫికేషన్ పై ప్రత్యేక దృష్టి పెట్టామనిఅందుకే స్వయంగా నేనే ఇంటింటికి తిరుగుతున్నాననిచెప్పారు.చనిపోయిన వారి పేర్లను కొన్ని చోట్ల తొలగించడం లేదని.మరి కొన్ని చోట్ల కొత్త ఓట్లు యాడ్ చేయడం లేదన్నారు. మార్పులు, చేర్పులకు ఇంకా సమయంఉన్న నేపథ్యంలో అన్ని దగ్గరుండి చూసుకుంటున్నామని తెలిపారు. క్షేత్ర స్థాయిలో టిడిపి బలంగా ఉండటంతో క్లస్టర్ ఇంచార్జ్ లు, పరిశీలిస్తున్నారని పేర్కొన్నారు.యాడ్ చేయాల్సిన బూత్ నెంబర్లను నారాయణ మీడియా ముందు చదివి వినిపించారు. వాటి వివరాలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని నారాయణ అన్నారు. ఈ కార్యక్రమంలో విజయ భాస్కర్ రెడ్డి తోపాటు స్థానికంగా ఉండే తెలుగుదేశం నాయకులు పలువురు పాల్గొనడం జరిగింది.

పంచాయతీ వార్డు ఎన్నికలకు సర్వం సిద్ధం

విశాలాంధ్ర-మనుబోలు:మనుబోలు మండలంలో మనుబోలు ,మదమనూరు,బండేపల్లి గ్రామాల్లో మూడు పంచాయతీ వార్డులకు ఆకస్మిక ఎన్నికలు నేడు జరగనున్న నేపథ్యంలో అధికారులు శుక్రవారం సర్వం సిద్ధం చేశారు. ఈ సందర్భంగా గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు సహకరించాలని ఆయా వార్డు ప్రజలను కోరారు. అదేవిధంగా బండేపల్లి మదమనూరు గ్రామాల్లో కూడా గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి ఎన్నికల సజావుగా జరిగేందుకు రంగం సిద్ధం చేశారు. ఉదయం 7 గంటల నుండి పోలింగ్ ప్రారంభమై పూర్తయిన తర్వాత కౌంటింగ్ ఉంటుందని ఎన్నికల అధికారి పేర్కొన్నారు.

22వ వార్డు లో ఎమ్మెల్యే పర్యటన

విశాలాంధ్ర - కావలి : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి పట్టణంలోని 22వ వార్డు లో శుక్రవారం పర్యటించారు. ఈ 4 సంవత్సరాలలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాల గురించి ఇంటి ఇంటికి తిరిగి ఆయన ప్రజలకు వివరించారు. కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు పాల్గొన్నారు.

సాధారణ సమావేశం

విశాలాంధ్ర-బుచ్చిరెడ్డిపాలెం: బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీలోని శుక్రవారం మున్సిపల్ చైర్ పర్సన్ మోర్ల సుప్రజ మురళి ఆధ్వర్యంలో సాధారణ సమావేశం నగర పంచాయతీ కార్యాలయంలో జరిగింది ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ బుచ్చిరెడ్డిపాలెం నగరపాలక పంచాయతీలో 32 తీర్మానాలు ఆమోదం తెలిపినట్లు ఆయన తెలిపారు మున్సిపల్ కార్యాలయం భవనానికి నిధులు మంజూరయ్యాయని త్వరలో భావన నిర్మాణం ప్రారంభించినట్లు ఆయన తెలిపారు 33 తీర్మానాలలో ఒక తీర్మానం వీధి కుళాయిలు తొలగించే విషయం ఆమోదం కింద లేదని అన్నారు ఈ కార్యక్రమంలో కొన్ని సమస్యలు కౌన్సిలర్స్ లేవనెత్తగా వాటిని త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు బస్టాండ్ సెంటర్లో ఆటోలు బైకులు ఎక్కడపడితే అక్కడ ఇష్టానుసారంగా పెడుతున్నారని ఆ సమస్య పరిష్కరించాలని కోరగా సిఐఎస్ఐలతో మాట్లాడుతానని కమిషనర్ హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో వైస్ చైర్పర్సన్ కోటంరెడ్డి లలిత రెడ్డి వైస్ చైర్మన్ క్ షేక్ సాహుల్ కౌన్సిలర్లు చీరల ప్రసాద్ యాదవ్ పొట్ట లక్ష్మీకాంతమ్మ మల్లారెడ్డి యానాద్ రెడ్డి శ్రీదేవి శివకుమార్ రెడ్డి అనంతమ్మ షకీలా బేగం సత్యనారాయణ కో ఆప్షన్ నెంబర్ ఇర్షాద్ అల్లా బక్షు టిడిపి కౌన్సిలర్ తాళ్ల వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

విశాలాంధ్ర-జలదంకి: మండలంలోని ఎల్ ఆర్ అగ్రహారం పంచాయతీ సర్పంచ్ స్థానానికి శనివారం పోలింగ్ జరగనున్న నేపథ్యంలో జిల్లా పంచాయతీ అధికారిని సుస్మితా రెడ్డి శుక్రవారం పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. తాగేటివారిపాలెం ఎల్.ఆర్ అగ్రహారంలోని 6 పోలింగ్ కేంద్రాలను పరిశీలించి,పోలింగ్ కేంద్రాల వద్ద వసతులు సక్రమంగా ఉండేలా చూడాలని పంచాయతీ సెక్రటరీ రామకృష్ణారెడ్డిని ఆదేశించారు. అనంతరం ఆమె జలదంకి 1,2 బ్రాహ్మణక్రాక 1,2 సచివాలయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బందికి పలు సూచనలుచేశారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సాయంత్రం సచివాలయంలో మూడు నుంచి ఐదు గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధర్ బాబు, ఆయా సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్ సీఎం కావాలని ఆలయంలో కుంకుమార్చన

విశాలాంధ్ర-నెల్లూరు సిటీ: జనసేన నగర అధ్యక్షులు దుగ్గిశెట్టి సురేష్ బాబు ఆధ్వర్యంలో, ఆ పార్టీ నేత పవన్ కళ్యాణ్ సీఎం కావాలని, స్థానిక నవాపేటలోని ఆర్యవైశ్య మహాలక్ష్మి దేవి అమ్మవారి ఆలయంలో లక్ష కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రావణమాసం మొదట శుక్రవారం కావడంతో లక్ష కుంకుమార్చన కార్యక్రమాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలను నిర్వ హించి మొక్కులు తీర్చుకున్నారు. తొలుత జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు చెన్నారెడ్డి మనుక్రాంత్ రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా సుజయ్ బాబు మాట్లాడుతూ తమ నేతపవన్ కళ్యాణ్‌కు రాజ్యాధికారం సిద్ధించాలని, ముఖ్యమంత్రి కావాలని ప్రత్యేక పూజలు నిర్వహిం చామని తెలిపారు. అలాగే ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని కోరుకున్నామని తెలిపారు. అనంతరం సుజయ్ బాబు భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర నాయకులు సుందర్‌రామి రెడ్డి, జిల్లా కార్యదర్శి షేక్.అలియా, నగర నాయకులు వెంకటేష్ గాదంశెట్టి, నగర డివిజన్ ఇన్చార్జులు శ్రీకాంత్, సౌమ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు జరుగుతున్న పంచాయతీ వార్డు ఎన్నికలకు సిద్ధం

విశాలాంధ్ర- రాపూరు: రాపూరు మండలం లో మూడు పంచా యతీలలు గోనుపల్లి, బొజ్జన పల్లి,గిలక పాడు గ్రామలలోని వార్డు సభ్యులకు ఎన్నికల్లో గోనుపల్లి పంచాయతీ వార్డు ఏకగ్రీవంగా ఎన్నిక కావడం జరిగింది. మిగతా రెండు బోజ్జన పల్లి,గిలక పాడు గ్రామాల్లో ఈ నెల 19 వ తేది శనివారం జరిగే ఎన్నికలకు శుక్రవారం ఎలక్షన్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది ఎలక్షన్లు జరిగే గ్రామాలకు తగు సూచనలు తెలియజేసి పంపడం జరిగిందని మండల అభివృద్ధి అధికారి అప్పాజీ తెలిపారు.

ప్రత్యేక పూజలు నిర్వహించిన మాలేపాటి

విశాలాంధ్ర - కావలి : రూరల్ మండలం ఆనెమడుగు పంచాయతీ ఆకుతోట గిరిజన కాలనీలో జరిగిన ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో కావలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సుబ్బానాయుడు ను మేళ తాళాలతో, పూలమాలలు వేసి ఆహ్వానించారు. అనంతరం ఆంజనేయస్వామిని దర్శించుకున్న ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానికులతో, చిన్నారులతో కాసేపు సరదాగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కావలి రూరల్ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఆవుల రామకృష్ణ, పార్టీ ముఖ్య నాయకులు ఉప్పాల వెంకటరావు, మందా చిన్నయ్య, పామంజి గోవిందు, జంపాని ప్రసాద్ పాల్గొన్నారు.

మాలకొండ హుండీ లెక్కింపు

ఆదాయంగా 1,03,02,637 రూపాయలు

విశాలాంధ్ర-వలేటివారిపాలెం: మండలంలోని మాల కొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంకు సంబందించిన 11వారాల హుండీ లెక్కింపు ద్వారా 1,03,02,637రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.బి.శ్రీనివాస రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగారం 0.260గ్రాములు,వెండి 2.370 గ్రాములు, యుఎస్ డాలర్లు. 43, యుఏఈ డాలర్లు. 200, ఆస్ట్రేలియన్ దాలర్లు,20 వచ్చినట్లు ఆయన తెలిపారు. శుక్రవారం జరిగిన హుండీ లెక్కింపు కార్యక్రమం జనార్దన్ స్వామి దేవస్థానం ఈఓ యడ్లవల్లి బైరాగి చౌదరి పర్యవేక్షణలో ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఎ.రామచంద్ర, వలేటివారి పాలెం ఎస్ఐ బాలుమహేంద్ర నాయక్, వివిఎల్ రవీంద్ర నాద్, కందుకూరు యాక్సిస్ బ్యాంక్ మేనేజర్ కె.పి.వివి.ఎస్. సమీర్ కుమార్,ఆలయ సిబ్బంది వెంకటేశ్వర్లు, శ్రీనువాసులు, రాజు, నారాయణ పాల్గొన్నారు

టీటీడీ చైర్మన్‌ను కలిసిన ఎమ్మెల్సీ



విశాలాంధ్ర- నెల్లూరు టౌన్: తిరుపతిలో నూతన టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డిని ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా కరుణాకర్ రెడ్డికి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.సరైన వ్యక్తికి రెండోసారి టిటిడిచైర్మెన్ పదవి దక్కడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.కరుణాకర్రెడ్డి టిటిడిచైర్మెన్ పదవి చేపట్టడంతో ప్రజలకు స్వామి సేవలు మరింత చేరువవుతాయన్న అభిప్రాయాన్ని ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి వ్యక్తం చేశారు. కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలోస్వామివారిసేవలు విశ్వవ్యాప్తమయ్యేలా టిటిడి కృషి చేయనుందని ఆయన తెలిపారు.

మూగజీవాలకు దాహార్తిని తీర్చిన సర్పంచ్



విశాలాంధ్ర- వలేటివారి పాలెం: మండలంలోని అయ్యవారి పల్లి గ్రామంలో ఎన్నో ఏళ్లుగా మూగజీవాలకు త్రాగునీటికి అనేక ఇబ్బందులు గురైతూ ప్రభుత్వ అధికారులకు,ప్రజా ప్రతినిధులకు అనేకసార్లు విన్నవించుకున్ననూ ఫలితం లేకుండా పోయింది.ఈ సందర్భంగా ఈ విషయాన్ని ప్రస్తుత సర్పంచ్ దేగా వెంకటేశ్వర్లు ధృష్టికి తీసుకొని రావడంతో తక్షణమే స్పందించిన సర్పంచ్ వెంకటేశ్వర్లు తాగునీటి ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని గ్రామపంచాయతీ నిధులతో మంచినీటి బోరు వేయించి మూగజీవాల తాగునీటి సమస్య తీర్చారు.దీంతో ఏళ్ల నాటి సమస్యకు బాయ్ బాయ్ చెప్తూ సర్పంచ్ దేగా వెంకటేశ్వర్లు కు పశువుల కాపరులు కృతజ్ఞతలు తెలియజేశారు.

గడప గడపకు మనప్రభుత్వంలో నేదురు మల్లి

విశాలాంధ్ర-రాపూరు:వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని రాపూరు మండలంలోని సం క్రాంతి పల్లి సచివాలయ పరిధిలోని తానంచర్ల పోకురుపల్లి గ్రామాలలో ఆంధ్ర రాష్ట్ర సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన ప్రతిష్టాత్మకమైన ప్రతి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పెంచలకోన దేవస్థాన పాలకవర్గ చెర్మన్ చెన్ను తిరుపాల్ రెడ్డి, రాపూరు మండల సోసైటి మాజీ చెర్మన్ చెన్ను భాస్కర్ రెడ్డి అద్వార్యాన శుక్రవారం తిరుపతి జిల్లా వైఎస్ఆర్‌సిపి అధ్యక్షుడు వెంకటగిరి నియోజవర్గ వైఎస్ఆర్సిపి పార్టీ సమన్వయ కర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి పాల్గొన్న కార్యాక్రమంలో నేదురుమ ల్లి రాంకుమార్ రెడ్డి గడపగడపకు వెళ్లి ఆంధ్ర రాష్ట్ర సీఎం జగ న్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షే మ పథకాలు అన్ని ప్రజలకు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకుని సంక్షేమ పథకాలు అందని వారికి ఆయా శాఖల అధికారులతో మాట్లాడి వెంటనే సంబంధిత లబ్ధిదారులకు సంక్షేమ పథకా లు వారికి అందించాలని అధికా రులకు సూచించారు. వీరితో పాటు బత్తిన పట్టాభి రామిరెడ్డి, తానం చర్ల కోటీశ్వర రెడ్డి, బాల కృష్ణారెడ్డి,మూరంరెడ్డి మధు సూదన్ రెడ్డి,మాజీ ఎంపిపి ఇసుళ్ళ సూర్య ప్రకాష్ యాదవ్ మండల నాయకులు, కార్యకర్త లు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మహిళలపై జరుగుతున్న దాడులు అరికట్టాలని సిఐటియు ర్యాలీ

విశాలాంధ్ర - నెల్లూరు: మణిపూర్‌లో మతోన్మాదులు రగిలించిన మారణ హెూమాన్ని, హింసకాండను నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లా ఉలవపాడు మండల కేంద్రంలో ఈరోజు స్థానిక సిడిపిఓ ఆఫీస్ నుండి అంగన్వాడీల నేతృత్వంలో పట్టణంలో ర్యాలీ జరిగింది. అనంతరం మానవహారం కార్యక్రమం చేపట్టారు. ఈ ర్యాలీని ప్రారంభిస్తూ ఉలవపాడు సిడిపిఓ బి.విజయ కుమారి మాట్లాడుతూ మణిపూర్ లో జరిగిన ఘటన భారతదేశంలోని మహిళలు సిగ్గుతో తలదించుకునే విధంగా ఉందని ఇలాంటి ఘటన లు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని ఆమె పేర్కొన్నారు. మానవహారం లో సిఐటియు జిల్లా నాయకులు జవిబి కుమార్ మాట్లాడారు. బిజెపి పాలనలో మతోన్మాదం,దాడులు పెరిగాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు అంజమ్మ, కామేశ్వరి ,నాగలక్ష్మి, రాధ, నీలాంబరి, సిఐటియు నాయకులు సిహెచ్. ఇందిరావతి ,వాకా. లతారెడ్డి,యం. పద్మావతి, పర్రె. తిరుపతమ్మ, కత్తి.బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు

విశ్వసనీయ ఆభరణాల సంస్థ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్

విశాలాంధ్ర-నెల్లూరు కార్పొరేషన్: విశ్వసనీయ ఆభరణాల సంస్థ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ అని నెల్లూరు నగర డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ అన్నారు. మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ సంస్థను నెల్లూరులోని మినీ బైపాస్ రోడ్డులో ఆనం వెంకటరెడ్డి విగ్రహం సెంటర్ సమీపాన శుక్రవారం ప్రారంభించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అన్నీ హంగులతో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ రూపు దిద్దుకుని పునఃప్రారంభించారు. రూప్ కుమార్ యాదవ్, ముక్కాల ద్వారకానాథ్ ముఖ్య అతిథులుగా పాల్గొని షోరూం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎక్కువ స్థలం, విస్తృతమైన ఆభరణాల సేకరణలు అంతర్జాతీయ స్థాయికి ధీటైన అనుభవం మేళవించి నెల్లూరు షోరూము పునర్నిర్మాణం చేశారని తెలిపారు. వివిధ రకాల వేడుకలకు మరియు బడ్జెట్ కు సరిపోయే బంగారం, వజ్రాలు , విలువైన రత్నాభరణాలు మొదలుకుని పోల్కీ ఆభరణాలు, పురాతన కళాకృతులతో పాటు మరెన్నో ఆభరణాలు ఈ షోరూములో లభిస్తాయని తెలిపారు. 4.9శాతం నుండి ప్రారంభమయ్యే అత్యల్ప తరుగు చార్జీల తో పాటు మలబార్ ఫెయిర్ ప్రైస్ , అత్యుత్తమైన పారదర్శక ధరతో అద్భుతమైన ఆభరణాలను అందిస్తోందని వివరించారు. 0శాతం డిడక్షన్ గోల్డ్ ఎక్స్ఛేంజ్ వాగ్దానంతో, హాల్ మార్క్ ఉన్నా లేకున్నా, ఏ ఇతర షోరూములో కొన్నవైనా, 22 క్యారట్ల బంగారు ఆభరణాలను మలబార్ హెచ్ యు ఐ డి హాల్ మార్క్ చేసిన ఆభరణాలతో మార్చుకోవచ్చని తెలిపారు. 100శాతం మార్పిడి విలువను పొందవచ్చని తెలిపారు. పునః ప్రారంభం సందర్భంగా ప్రతికొనుగోలుపై వెండికాయిన్ అందజేశారు. కార్యక్రమంలో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ సెంట్రల్ ఆంధ్ర జోనల్ హెడ్ నిఖిల్ చంద్రన్ , నెల్లూరు షోరూము హెడ్ సాహిల్, నెల్లూరు అసిస్టెంట్ స్టోర్ హెడ్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశ్రీశ్రీ మహావిష్ణువు శ్రీ అయ్యప్ప దేవస్థానంలో వరలక్ష్మీవ్రతం

విశాలాంధ్ర-రాపూరు:రాపూరు మేజర్ పంచాయతీ లోని మద్దులు మడుగు సమీపం లో వెలసియున్న శ్రీశ్రీశ్రీ మహావిష్ణు వు శ్రీ అయ్యప్ప దేవాలయంలో ఈనె 25 వతేది శుక్రవారం అ త్యంత వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించడం జరుగుతుందని వ్రతంలో పాల్గొను మహిళలకు కమిటీ తెలియజెస్తు వ్రతమునకు సంబ దించిన పూజా సామాగ్రి రెండు గ్రాముల వెండి లక్ష్మీ డాలరు, రవిక, పూజా సామాగ్రి దెవస్థానం వారు ఇవ్వడం జరుగుతుందని వ్రతంలో పాల్గోను వారు రూ 516/ లు కట్టి పేరు నమోదు చేసుకోవాలని వ్రతం చేయువారు టెంకాయ, కర్పూరం తెచ్చుకుని ఉదయం 8 గంటలకు ఆది మహల క్ష్మమ్మకు అభిషేకాలు అలంకారం, ఉదయం 9.30గం నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు వ్రత పూజలు తదనంతరం అన్న ప్రసాదం నిర్వహించడం జరుగు తుందని, వ్రతంలో పాల్గోను మహిళా భక్తులు రూ 51 6/ చెల్లించి పేరు నమోదు చెసు కోవాలని, అత్యంత వైభవంగా సౌభాగ్య వరలక్ష్మీ వ్రతం నిర్వ హించడం జరుగుతుందని శ్రీశ్రీశ్రీ మహావిష్ణువు శ్రీ అయ్యప్పసేవా సమాజం కమిటీ తెలియ జేసారు.

ప్రభుత్వ ఆసుపత్రి ఏ ఒక్కరి సొత్తు కాదు

నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ మాలేపాటి

విశాలాంధ్ర - కావలి: ప్రభుత్వ ఆసుపత్రి ఏ ఒక్కరి సొత్తు కాదని, ప్రభుత్వ వైద్యశాల అనేది తనదో లేక ఎమ్మెల్యేదో కాదని ఇది ప్రజలందరిదని కావలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు హితవు పలికారు. బోగోలు మండలం, బేతనియపేట కు చెందిన దావులూరి రచన కొంతమంది వేధింపుల కారణంగా నాలుగు రోజుల క్రితం ఆత్మహత్య ప్రయత్నం చేయగా కావలి ప్రభుత్వ ఆసుపత్రిలో ఆమె చికిత్స పొందుతున్నారు. శుక్రవారం ఆమెను హుటాహుటిన ఎమ్మెల్యే డిశ్చార్జ్ చేయమన్నారని సిబ్బంది తెలిపిన నేపథ్యంలో సుబ్బానాయుడు ఆసుపత్రికి చేరుకొని ఆమెను పరామర్శించారు. పేద ప్రజల పక్షాన తాను ఉన్నానంటూ వారికి ధైర్యాన్ని ఇచ్చారు. ఎవరో చెబితే ఎలా డిశ్చార్జ్ చేస్తారని, ఆరోగ్యం కుదుట పడకుండా ఎలా పంపిస్తారని సిబ్బందిని ఆయన ప్రశ్నించారు. మరొకసారి ఇటువంటి చర్యలు పునరావృతం అయితే సహించేది లేదని ఆయన హెచ్చరించారు.

దామవరంలో మహాశక్తి మహిళల పర్యటన

విశాలాంధ్ర - కావలి: నియోజకవర్గంలోని దగదర్తి మండలం దామవరం పంచాయతీలో కావలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు ఆదేశానుసారం శుక్రవారం మహాశక్తి మహిళలు మహాశక్తి కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంచుతూ.. వాకిళ్ళకు మహాశక్తి స్టిక్కర్లు అతికిస్తూ తెలుగుదేశం పార్టీ ప్రచారాన్ని నిర్వహించారు. మహిళలతో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. చంద్రబాబు నాయకత్వం వర్ధిల్లాలి, మాలేపాటి నాయకత్వం వర్ధిల్లాలి, మహాశక్తి వర్ధిల్లాలి అంటూ మహిళలు నినాదాలు చేశారు. చంద్రబాబు ప్రకటించినటువంటి మినీ మేనిఫెస్టోలో మహిళలకు ఉన్న సౌలభ్యాలను అందరికీ అర్థమయ్యేలా వివరించారు. చంద్రబాబుని గెలిపించుకోవడమే మహాశక్తి ధ్యేయమని అభివర్ణించారు. మహిళల ప్రోత్సాహంతో తెలుగుదేశం పార్టీని గెలిపించుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా గెలవాలని ఆశీర్వదించిన పసుపుతాళ్లను మహాశక్తి మహిళా నేతలకు అందించారు. ఈ కార్యక్రమంలో మహాశక్తి మహిళా నేతలు కొల్లూరు అశ్విని, గోళ్ళ అమర జ్యోతి, రాపూరి రాధమ్మ, జహీరా బేగం, తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు మాలేపాటి గణేష్, ఐతా మహేశ్వరరావు, కాటకూట శ్రీనివాసరావు, ఐతా రాజేష్, పర్వతనేని సుమన్, తుమ్మల దినేష్, రావి నాగేశ్వరరావు, మక్కిన వెంకటేశ్వర్లు, ఐతా మాల్యాద్రి, కోయి నరేష్, తమ్మినేని కోటి, మాలేపాటి ప్రకాష్, కుప్పూరు కొండయ్య, నిమ్మలగడ్డ శేషయ్య, కాటకూట రేణుక, కుప్పూరు తిరుపతమ్మ, నాగభూషణమ్మ, ఐతా సులోచన, తుమ్మల వెంకట రమణమ్మ, మాలేపాటి కళ్యాణి, తుమ్మల నాంచమ్మ, అధిక సంఖ్యలో యువత, మహిళలు పాల్గొన్నారు.

బేల్దారి మేస్త్రి కి అండగా నిలిచిన కాకర్ల చారిటబుల్ ట్రస్ట్

విశాలాంధ్ర-వరికుంటపాడు: మండలం లోని దక్కునూరు కు చెందిన బెల్దారి మేస్త్రి గూడల రవి భవన నిర్మాణ సమయంలో అకస్మాత్తుగా పైనుంచి కిందపడి రెండు కాళ్లు విరగడం జరిగింది. ప్రమాద విషయం మాగంటి మాలకొండయ్య ద్వారా కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ అధినేత కాకర్ల సురేష్ కు తెలుపగా వెంటనే స్పందించినాయన రవి కుటుంబ సభ్యులకు పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. భవిష్యత్తులో అండగా ఉంటామని సురేష్ తెలిపినట్లు మాలకొండయ్య అన్నారు.

రాష్ట్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల బలోపేతానికి కృషి:కాకాణి

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: రైతుల విస్తృత ప్రయోజనాలే లక్ష్యంగా రాష్ట్రంలోప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల బలోపేతానికి కృషి చేస్తున్నట్లురాష్ట్ర వ్యవసాయ, సహకార,మార్కెటింగ్,ఫుడ్ ప్రాసెసింగ్ శాఖమంత్రికాకాణిగోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు.శుక్రవారంసహకార శాఖ, జిల్లాసహకారకేంద్ర బ్యాంక్ సహకారంతో నెల్లూరు టౌన్ హాల్ లో ఏర్పాటు చేసిన సహకార సంఘాలు - అవగాహనా సదస్సును మంత్రి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో మందకొడిగా ఉన్నసహకార రంగాన్ని బలోపేతం చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి ఆలోచనచేస్తూ, అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని మంత్రి చెప్పారు.అనుభవజ్ఞులైన, సమర్థవంతమైన వ్యక్తులను సంఘాలకు చైర్మన్లుగా, మెంబర్లుగా నియమించినట్లు చెప్పారు. సహకార బ్యాంకులను పటిష్టపరచడం, రైతులకు విస్తృతంగా సేవలందించడం, సహకార రంగంపై అవగాహన కల్పించడమే ప్రధాన ఉద్దేశంగా ఈసదస్సును నిర్వహిస్తున్నట్లు చెప్పారు.దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి సహకార సంఘాల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు.అనంతరం వచ్చిన పాలకుల నిర్ణయాల వల్ల సహకార రంగం గాడి తప్పిందని, మళ్లీ ఇప్పుడు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సహకార రంగం పూర్వ వైభవానికి చర్యలు చేపట్టినట్లు చెప్పారు. జిల్లాలో 78 ప్రాథమిక వ్యవసాయ కోపరేటివ్ సొసైటీలుఉన్నాయన్నారు.నష్టాల్లో ఉన్న కడప, కర్నూలు,ఏలూరు జిల్లాల బ్యాంకులతో పాటు రాష్ట్రంలోని అన్ని సహకార బ్యాంకులు లాభాల బాట పట్టించిన ఘనత ముఖ్యమంత్రి కే దక్కిందని చెప్పారు. ప్రత్యేక కార్యాచరణ, శిక్షణ, హెచ్ఆర్ పాలసీ, డిజిటలైజేషన్ వంటి అత్యాధునిక విధానాలతో సెంట్రల్ బ్యాంకుల రూపురేఖలు పూర్తిగా మారినట్లు చెప్పారు. ఈ క్రాప్ బుకింగ్ ఆధారంగా ఎక్కడా పొరపాట్లు, అవినీతికి తావు లేకుండా పూర్తి పారదర్శకంగా రైతులకు రుణాలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా సకాలంలో ఎరువులు,విత్తనాలు,పురుగుమందులు అందిస్తున్నట్లు చెప్పారు. ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు లేకుండా ప్రతిసహకారసంఘం పరిధిలో బహుళార్థసాధక గోడౌన్లను నిర్మిస్తున్నటు చెప్పారు. గ్రామంలో తయారయ్యే ప్రతి ఉత్పత్తిని సహకార రంగంలోకి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. బ్యాంకింగ్ కరస్పాండెంట్లను నియమించి రైతుల ముంగిటకే బ్యాంకు సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. నెల్లూరు సెంట్రల్ బ్యాంక్ ఆధ్వర్యంలోఇప్పటికే 100 ఏటీఎం సెంటర్లను ప్రారంభించామని, ప్రతి మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో బ్యాంకు శాఖను,ఏటీఎంకేంద్రాన్ని ఏర్పాటుచేసేందుకుచర్యలుచేపట్టినట్లు మంత్రి చెప్పారు.సివిల్ సప్లై ద్వారా రైతులకు రావాల్సిన కమిషన్ డబ్బులను కూడా త్వరలోనే ఇప్పిస్తామన్నారు. సహకార సంఘాలు లాభాలు ఆర్జించడమే ప్రధాన లక్ష్యంగా, దేశానికేఆదర్శంగా మనసహకార వ్యవస్థని నిలబెట్టేలా ముఖ్యమంత్రి కృషిచేస్తున్నారని మంత్రి పునరుద్ఘాటించారు. రైతులందరూ కూడా సహకార రంగం పట్ల అవగాహన కలిగి బాధ్యతలు తెలుసుకొని సహకార సంఘాల బలోపేతానికి తమ వంతు కృషి చేయాలనిమంత్రి ఈసందర్భంగా పిలుపు నిచ్చారు.అనంతరం మంత్రిని పలువురు ప్రముఖులు, రైతులు ఘనంగా సత్కరించారు.ఈ అవగాహన సదస్సులో ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, కోపరేటివ్మేనేజ్మెంట్ డైరెక్టర్ గణేషన్, జాయింట్ రిజిస్ట్రార్ రాధిక మాధవి, జిల్లా సహకార శాఖ అధికారి సుధా భారతి, ప్రకాశం జిల్లా సహకార శాఖ అధికారి రాజశేఖర్, నాబార్డ్ డి డిఎంరవిసింగ్, ఎన్డిసిసి బ్యాంక్ సీఈవో శంకర్ బాబు సహకార సంఘాల చైర్మన్లు,సభ్యులు,రైతులు పాల్గొన్నారు.

అరాచక పాలనకు చరమగీతం: మాజీ ఎమ్మెల్యే బొల్లినేని

విశాలాంధ్ర-జలదంకి: రాష్ట్రంలో ప్రస్తుతం అరాచక పాలన సాగుతోందని, 2024లో జరిగే ఎన్నికల్లో ఆ పాలనకు చరమగీతం పడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే టిడిపి పార్టీ ఇంచార్జ్ బొల్లినేని వెంకట రామారావు స్పష్టం చేశారు. మొన్న నియోజకవర్గంలోని కొండాపురం మండలంలో వైసీపీ పార్టీ ఇన్చార్జిగా ఉన్న మేకపాటి రాజగోపాల్ రెడ్డి మైనార్టీ ఎమ్మార్వో ని బహిరంగంగా దూషించారని ఈ విషయం అన్ని సామాజిక మాధ్యాలలో కనిపించిందన్నారు. రాష్ట్రంలో వైసిపి అరాచక పాలనకు అడ్డు అదుపు లేకుండా పోయిందని, ఇందుకు నిదర్శనం మొన్న ఎమ్మార్వో పై దూషణ పర్వమేనన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన జలదంకి లోని స్థానిక టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం ఈ సందర్భంగా బొలినేని మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ రాష్ట్ర పాలన గురించి విమర్శిస్తే నీకెందరు పెళ్ళాలంటూ పవన్ కళ్యాణ్ గురించిమాట్లాడతారని, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రశ్నిస్తే ఆయనపై వ్యక్తిగత విమర్శలకు దిగుతారని, రామోజీరావు పత్రికల్లో వార్తలు ప్రచురిస్తే మార్గదర్శి పై దాడులు నిర్వహిస్తారని ఇంతకంటే అరాచక పాలన ఎక్కడైనా ఉందా అంటూ ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలోని ప్రజలంతా వైసిపి పాలనపై విసిగి వేసారి ఉన్నారని రాబోయే ఎన్నికల్లో వైసిపి కి తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో ఈనెల 19న 15 వార్డులకు, ఒక సర్పంచ్ స్థానానికి ఉప ఎన్నికలు జరగనున్నాయన్నారు. ఈ ఎన్నికలలో అత్యధిక వార్డులు సర్పంచ్ స్థానం టిడిపి కైవసం చేసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నియోజకవర్గ ప్రజలంతా టిడిపి వైపే ఉన్నారని, ఈ నాలుగున్నర సంవత్సరాల వైసిపి పాలనతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. నియోజకవర్గం టిడిపి పాలనలో ఎంతో అభివృద్ధి జరిగిందని, ఇప్పటికీ ప్రజలంతా చర్చించుకుంటూ ఉన్నారన్నారు. టిడిపి మహిళలు నిర్వహించే మహాశక్తి కార్యక్రమానికి ప్రజల నుంచి భారీ స్పందన వస్తుందన్నారు. మహాశక్తి మహిళలు ఏ గ్రామానికి వెళ్ళినా సాదర స్వాగతం పలుకుతున్నారని తెలిపారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న, లేకున్నా రాష్ట్ర ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి ఎల్లవేళలాకృషి చేస్తుందన్నారు. తమకు ఉన్న పరిచయాలతో ఇప్పటికీ అభివృద్ధిలో పాలుపంచుకుంటున్నామన్నారు. నిర్మాణం జరుగుతున్న కావలి ఉదయగిరి రోడ్డు విస్తరణతో భూములకు విలువ పెరిగిందన్నారు. రోడ్డు విస్తరణతో జలదంకి మండల ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికలలో ప్రజలంతా టిడిపికి ఓటు వేసి ఆశీర్వదించాలని మరల చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందుతుందని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు పులిగుంట మధుమోహన్ రెడ్డి, ఉదయగిరి నియోజకవర్గ పార్టీ ఎన్నికల పరిశీలకులు వికాస్ హరికృష్ణ, ఉదయగిరి నియోజకవర్గ రైతు అధ్యక్షులు పూనూరు భాస్కర్ రెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షులు కంచర్ల వినోద్, రైతు నరేంద్ర, పచ్చ పెంచలనాయుడు, మేదరమెట్ల శేషారెడ్డి, తదితర నేతలు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల నిబంధనల ప్రకారం పరిష్కరించండి:కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు::శాసనసభ్యులు అధికారుల దృష్టికి తీసుకు వచ్చిన రెవెన్యూ సమస్యలు నిబంధనల ప్రకారం పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం హరి నారాయణన్ నియోజకవర్గ రెవెన్యూ అధికారులను ఆదేశించారు.కలెక్టర్ ఛాంబర్ లో శుక్రవారం కావలి నియోజకవర్గం లో రెవిన్యూ సమస్యలపై ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్, ఆర్డిఓ సీనానాయక్, సమక్షంలో నియోజకవర్గంలోని రెవెన్యూ అధికారులతో సమీక్ష చేశారు. కావలి శాసన సభ్యులు నియోజక వర్గంలో రెవెన్యూ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు.ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ కావలి నియోజకవర్గం లో భూ సమస్యల పరిష్కారానికి రెవిన్యూ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పర్యటనల్లో ఆయన దృష్టికి వచ్చిన సమస్యలను, రెవిన్యూ అధికారుల దృష్టికి తీసుకు వచ్చినపుడు సత్వరమే స్పందించి పరిష్కారానికి చర్యలుచేపట్టాలన్నారు. భూ సమస్యల పరిష్కారం కోసం వచ్చే రైతులకు వీఆర్వోలు, సర్వేయర్లు అవగాహన కల్పించి సహకరిస్తే గ్రామస్థాయిలోనే పరిష్కారం అవుతాయని కలెక్టర్ అన్నారు. గ్రామస్థాయిలోనే సమస్యలు పరిష్కరించే విధంగా వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లకు తగిన ఆదేశాలు ఇవ్వాలనీ తహశీల్దార్లకు సూచించారు. కుటుంబ వారసులకు మ్యుటేషన్స్ జారీ చేయడంతో రైతులను ఇబ్బందులు పెట్టవద్దన్నారు. అసైన్మెంట్ భూములకు సంబం ధించి భూమి మీద ఉన్న వారికి వారికి నిబంధనల ప్రకారం పట్టాదార్ పాస్ పుస్తకాలు ఇవ్వాలన్నారు. చుక్కల భూములు రెగ్యులరైజ్ చేసిన తర్వాత నోషనల్ ఖాతా ఉంటే వాటికి సంబంధించిన ప్రతిపాదనలు జిల్లా కలెక్టర్ కు ఈనెల 25లోగాపంపాలని సూచించారు. భూములకు సబంధిం చిన కోర్ట్ కేసులుంటే గవర్నమెంట్ ప్లీడరు సహకారం తో కౌంటర్ దాఖలు చేయాలన్నారు.ఈ సమావేశం లో కావలి నియోజక వర్గం లోని తహశీల్దార్లు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాలను సందర్శించిన డీఎంహెచ్‌వో

విశాలాంధ్ర-కందుకూరు రూరల్ : ఈరోజు డిఎంహెచ్‌వో పెంచలయ్య మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఆశాలతో మాట్లాడి అందరికి తగు సూచనలు ఇచ్చారు.తరువాత కొండముదుసు పాలెం లో ఈరోజు ఎంపీపీచే ప్రారంభించబడిన కంటివెలుగు కార్యక్రమాన్ని సందర్శించారు.జనార్ధన కాలనీ లో కొత్తగా నిర్మాణంలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్ ని సందర్శించారు.తదుపరి కోటారెడ్డి నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో జరుగుతున్న ఫ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో ఆయన వెంట డిప్యూటీ డి ఎం హెచ్వో డాక్టర్ ప్రియం వద డాక్టర్ ప్రమోద్ మాచవరం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వాతి అర్బన్ డాక్టర్స్ డాక్టర్ బ్యుల గ్రేస్ మరియు డాక్టర్స్ స్టెల్ల కారుణ్య పాల్గొన్నారు.

మందుల ఖర్చులకు రూ.20 వేలు అందజేత

విశాలాంధ్ర - కావలి : అనారోగ్యంతో బాధపడుతున్న కట్టా శ్రీనివాసులు భార్యకు ఎస్ఎస్ఈహెచ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం రూ.రూ.20 వేలు అందజేశారు. గుడ్లూరు లోని జిల్లా పరిషత్ హైస్కూల్లో 1988 లో ఎస్.ఎస్.సి. చదివిన పూర్వ విద్యార్థులు ఎస్ఎస్ఈహెచ్ ట్రస్ట్ ఏర్పాటు చేసి ఈ కార్యక్రమం చేపట్టారు. 35 సంవత్సరాల తరువాత ఇటీవల వీరు పునః సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించి ట్రస్ట్ ఏర్పాటు చేశారు. ట్రస్ట్ మొదటి సేవా కార్యక్రమంలో భాగంగా వారి క్లాస్మేట్ గుడ్లూరు మండలం చెమిడిదపాడు కు చెందిన కట్టా శ్రీనివాసులుకు భార్య మందుల ఖర్చులకు రూ.20000 (రెండు నెలలకు సరిపడా) అందజేశారు. తమ ట్రస్ట్ సభ్యుడు కొరిసిపాటి మధుసూదనరెడ్డి(జపాన్) సహకారంతో ట్రస్ట్ తరపున దీనిని అందజేశారు. ఈ కార్యక్రమంలో కోకా చిరంజీవి, కాపులూరు శ్రీనివాసులు, గుండ్లపల్లి శ్రీనివాసులు, షేక్ రసూల్ బాషా, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధుకు, ట్రస్టుకు కట్టా శ్రీనివాసులు తన కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు ముమ్ముందు కూడా చేస్తామని సభ్యులు తెలియజేశారు.

గిరీష్ కు పలువురు ప్రముఖులు సంతాపం

విశాలాంధ్ర - కావలి : పట్టణ ఆర్య వైశ్య ప్రముఖుడు, 8వ వార్డు కు చెందిన బియ్యం వ్యాపారి జలదంకి గిరీష్ హార్ట్ స్ట్రోక్ కారణంగా గురువారం మృతి చెందారు. శుక్రవారం కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి, కావలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు గిరీష్ భౌతికకాయాన్ని దర్శించి పూలమాలలు వేసి సంతాపం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కనమర్లపూడి నారాయణ, తోట హరి, శివ, పోతుగంటి శ్రీకాంత్, పట్టణ ముస్లిం మైనారిటీ విభాగం అధ్యక్షులు సయ్యద్ అబ్దుల్ రహీం, 8వ వార్డు పార్టీ అధ్యక్షులు మోహన్, గిరీష్ కుమార్ మిత్రులు గునుపూడి సురేష్, గాదంశెట్టి వేణు, పాదర్తి నాగరాజు, పోతుగంటి మురళి, మామిడి రామకృష్ణ, చీదెళ్ళ కిషోర్ గుప్తా, శభరి, ఓలేటి గుప్తా, పానుగంటి కొండలు, శ్రీనివాసులు, జలదంకి రమణయ్య, గ్రంధివెంకయ్య ,కృష్ణారెడ్డి, పోతుగంటి శ్రీదర్, చలువాది సత్యం, మధు, పాదర్తి ఉదయ్, పానుగంటి జయ రామారావు, తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

ఈవో బైరాగి చౌదరికి ఉత్తమ సేవా పురస్కారం

విశాలాంధ్ర-కందుకూరు రూరల్ : కందుకూరు శ్రీదేవి భూదేవి సహిత శ్రీ జనార్ధన స్వామి ఆలయ కార్యనిర్వాహణాధికారి బైరాగి చౌదరికి ఉత్తమ సేవా పురస్కారం అందజేశారు. 77వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా నెల్లూరు లో జరిగిన స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో మంత్రి అంబటి రాంబాబు చేతుల మీదుగా ఉత్తమ పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బైరాగి చౌదరి మాట్లాడుతూ తనకి పురస్కారం రావడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ఈ పురస్కారం రావడం తన విధి నిర్వ హణ పట్ల మరింత బాధ్యతను పెంచిందని అన్నారు. శాసనసభ్యులు మహి ధర్ రెడ్డి సహకారంతో జనార్ధన స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేస్తానని అన్నారు. ఆలయ చైర్మన్ రావులకొల్లు బ్రహ్మానందం, ఆలయ కమిటీ సభ్యులు, మిత్రులు బైరాగి చౌదరికి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన

విశాలాంధ్ర- మర్రిపాడు: మర్రిపాడు మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ నందు శుక్రవారం ఆటో డ్రైవర్లకు ఎస్ఐ విశ్వనాథ్ రెడ్డి అవగాహన కల్పించారు. ఎస్ఐ విశ్వనాధ్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన సిఐ

విశాలాంధ్ర-మనుబోలు: మనుబోలు అంబేద్కర్ నగర్లో పోలింగ్ కేంద్రాన్ని పొదలకూరు సర్కిల్ సిఐ సంగమేశ్వర రావు శుక్రవారం ఉదయం పరిశీలించారు.ఈనెల 19వ తేదీ నాలుగో వార్డ్ ఉపఎన్నిక నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా శనివారం జరిగే ఎన్నికల కోసం గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే మడమనూరు బండేపల్లి లో కూడా వార్డు మెంబర్ ఉపఎన్నికఎన్నిక జరగనున్నాయి.అలాగే ఎస్ఐ అజయ్ కుమార్ కూడా పోలింగ్ కేంద్రాలను పరిశీలించి అక్కడ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పర్యవేక్షించారు.ఈవో ఆత్మకూరు వెంకట రమణయ్య ఉపసర్పంచ్, కన్వీనర్ కడివేటి చంద్రశేఖర్ రెడ్డివైస్సార్సీపీ నాయకులు, మధు రెడ్డి.సీఐ వెంట హెడ్ కానిస్టేబుల్ ఎస్కే మస్తాన్. మాదవ్,రమేష్ బాబు. మధు తదితరులు ఉన్నారు. శనివారం ఉదయం 7 గంటల నుంచి ఒంటిగంట వరకు ఇక్కడ ఎన్నికలు నిర్వహిస్తారు నాలుగో వార్డ్ లో 420 ఓట్లు ఉన్నట్లు ఈవో ఆత్మకూరు వెంకటరమణ చెప్పారు. పోలింగ్ కేంద్రానికి కావాల్సిన ఏర్పాట్లను సిద్ధం చేసినట్లు ఈవో వెంకట రమణతెలిపారు. నాలుగో వార్డులో వైఎస్ఆర్సిపి తరఫున ప్రెషర్ కుక్కర్ అభ్యర్థి పరిమళ ఆదిశేషమ్మ, టిడిపి తరఫున గౌను గుర్తు అభ్యర్థి చింతల శేషమ్మ పోటీలో ఉన్నారు.

సంజీవని ఆరోగ్య రథం-ఉచిత వైద్య సేవలు

విశాలాంధ్ర-ఉదయగిరి: కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య సేవలు శుక్రవారం జరిగాయి. నియోజకవర్గ పరిధిలోని వింజమూరు మండలం బొమ్మరాజు చెరువు ఎల్లమ్మ గుడి వద్ద సంజీవని ఆరోగ్య రథం ద్వారా వివిధ రుగ్మతులతో బాధపడుతున్న వారిని 197 మందిని డాక్టర్లు పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వారిలో 87 మందికి కంటి సమస్యలతో బాధపడుతున్నారని మరో 110 మంది వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని పరీక్షించినట్లు నిర్వాహకులు తెలిపారు .ఈ సందర్భంగా బొమ్మలాచెరువు గ్రామ ప్రజలు నియోజకవర్గ తెలుగుదేశం నాయకులు కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కాకర్ల సురేష్‌ను అభినందించారు. నియోజకవర్గంలో మొట్ట మొదటిసారి మాలు మూల గ్రామాల లో సైతం ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం కాకర్ల సురేష్‌కే సాధ్యమైందని గ్రామ ప్రజలు తెలిపారు. తమకు అండగా ఉండి అన్ని విధాలుగా ఆదుకుంటున్న సురేష్ వెంటనే తాము నడుస్తామని గ్రామ ప్రజలు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

వ్యాన్ ఢీ కొని ఒకరు మృతి

విశాలాంధ్ర - కావలి :పట్టణంలోని విట్స్ కాలేజీ క్రాస్ రోడ్డు వద్ద గురువారం అర్ధరాత్రి గొర్రెలు లోడ్ తో వెళ్తున్న టాటా మ్యాజిక్ వ్యాన్ బీభత్సం సృష్టించింది. టాటా మ్యాజిక్ వ్యాన్ వేగంగా వెళ్తూ బైక్ ని ఢీ కొట్టడంతో ఒకరు మృతి చెందారు. మరొకరికి తీవ్ర గాయాలు అయినవి. వెంటనే వారిని కావలి ప్రభుత్వ ఏరియా వైద్యశాల కు తరలించారు. మృతి చెందిన వ్యక్తి జలదంకి మండలం చోడవరం గ్రామానికి చెందినా ఎల్లావుల మనోహర్(20)గా పోలీసులు గుర్తించారు. ఘటనా స్థలానికి చేరుకున్న కావలి రెండవ పట్టణ పోలీసులు విచారణ చేపట్టారు.

గడపగడపలో మేకపాటి

పెద్ద ఎత్తున స్వాగతం పలికిన మహిళలు

విశాలాంధ్ర-వరికుంటపాడు: మండలంలోని గణేశ్వర పురం లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉదయగిరి ఇంచార్జ్ మేకపాటి రాజగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాలకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారని అన్నారు. ముఖ్యంగా మహిళాభ్యుదయానికి మహిళల అభివృద్ధికి ముఖ్యమంత్రి నిర్విరామంగా కృషి చేస్తున్నాడని అన్నారు. భవిష్యత్తు ఎన్నికల్లో సంక్షేమ పరిపాలన కొనసాగాలంటే ప్రతి ఒక్కరు జగన్మోహన్ రెడ్డికి అండగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ అలీ అహ్మద్, మండలపు తిరుపతి నాయుడు,సర్పంచి వడ్లపల్లి తిరుపాలు, ఎంపీటీసీ సభ్యురాలు సింగం రెడ్డి సృజన, యువ నాయకులు సింగం రెడ్డి సురేష్, కామేపల్లి వెంకటరత్నం, గంగవరపు పుల్లయ్య నాయుడు, చిందే వెంకటేశ్వర్లు, సొసైటీ అధ్యక్షులు గుంటుపల్లి రామాంజనేయులు , జక్కం శ్రీనివాసులు రెడ్డి, మాగంటి శ్రీనివాసులు, ఎంపీడీవో విజయభాస్కరరావు, వెలుగు ఏరియా కోఆర్డినేటర్ శేషారెడ్డి, వెలుగు ఏపిఎం వైనారూత్ పలువురు వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

పల్లె పల్లెకు పసుపులేటి

విశాలాంధ్ర - కావలి: ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకుని ఈనెల 20వ తారీఖు నుండి "పల్లె పల్లెకు పసుపులేటి" కార్యక్రమాన్ని పిఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పసుపులేటి సుధాకర్ ప్రారంభిస్తున్నారు. కరోనా సమయంలో నియోజకవర్గంలోని ప్రజలకు తన ట్రస్ట్ ద్వారా సేవలు అందించి ఎంతో మందిని సుధాకర్ ఆదుకున్నాడు. పిఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా కావలి నియోజకవర్గంలో పసుపులేటి సుధాకర్ చేసిన సేవలు చాపకింద నీరులా, చేసిన సాయం బహిర్గతం చేసుకోకుండా ప్రజలు దీవెనలతో ముందడుగు వేయాలని నిర్ణయించుకొని ఈ కార్యక్రమం చేపట్టారు. ఆయనకి అధికారం అనే ట్యాగ్ లేకపోయినా, నా నియోజకవర్గ ప్రజలకి మంచి చేకూరాలి అనే బాధ్యత కలిగి సేవలు అందిస్తూనే ఉన్నాడు. అధికారం అనే ముసుగులో దోచుకుని, దాచుకునే వారితో పోలిస్తే పసుపులేటి నూటికి నూరు శాతం సరైన వ్యక్తి అని ప్రజల నుండి వస్తున్న మాట. కుళ్ళు లేదు, కుతంత్రం అంతకంటే లేదు, సాయం కోరిన వారికి చేయూతనివ్వడం తప్ప అని ప్రజల గుండెల్లో బలంగా నాటుకుపోయారు సుధాకర్. కావలి నియోజకవర్గంలో ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు ఈనెల 20న మొదలుపెట్టిన పల్లె పల్లెకు పసుపులేటి కార్యక్రమం విజయవంతం చేయాలని ఆయన అభిమానులు, ఆయన నుండి లబ్ది చేకూరిన వ్యక్తులు కోరుకుంటున్నారు. పవర్ కోసం కాదు, పరిస్థితుల మార్పుకోసం అవకాశం ఇవ్వండి అంటూ సుధాకర్ ప్రజల ముందుకు వెళ్తున్నాడు.

అద్దాల మండపం ప్రారంభం

విశాలాంధ్ర- బుచ్చిరెడ్డి పాలెం : మండలం లోని జొన్నవాడ గ్రామంలో వెలసి అన్న శ్రీ మల్లికార్జున స్వామి కామాక్షితాయి అమ్మవార్ల దేవస్థానం నందు దాతలు నెల్లూరు వాస్తవ్యులు పోట్ల దశరథ రామయ్య ధర్మపత్ని యనాదమ్మ దంపతులు సహకారం తో నిర్మించిన శ్రీ స్వామి అమ్మవార్ల అద్దాల మండపం శుక్రవారము నాడు దేవస్థాన చైర్మన్ శ్రీ పుట్టా లక్ష్మీ సుబ్రహ్మణ్యం నాయుడు దంపతులు మరియు కార్యనిర్వహణాధికారి డబ్బుగుంట వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శ్రీ లక్ష్మీ గణపతి స్వామి వారికి, మల్లికార్జున స్వామి వారికి, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి, శ్రీ కామాక్షితాయి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం వారిని శేషవస్త్రంతో సత్కరించి, తీర్థ ప్రసాదములు అందచేశారు.